ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.7 : కనిష్ఠం 21.9
నిర్మల్ జిల్లా వార్తలు
8
బుధవారం 12 మార్చి 2025



సారంగాపూర్‌లో దొంగతనం

కడెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కడెం మండలం సారంగాపూర్ గ్రామంలో వంగ గౌతమి ఇంట్లో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గౌతమి భర్త సుధాకర్ గల్ఫ్ దేశం వెళ్లడంతో ప్రతిరోజు రాత్రి తన యారాలు ఇంటి వద్ద పడుకునేది. ఎప్పటిలాగే సోమవారం రాత్రి 9 గంటలకు భోజనం చేసి తన యారాలు రూమ్‌కి వెళ్లి పడుకుంది. కాగా మంగళవారం ఉదయం 6 గంటలకు ఇంటికి వెళ్లి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో ఉన్న 20 గ్రాముల బంగారం, 5 తులాల వెండి దొంగతనం జరిగిందని వంగా గౌతమి కడెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కడెం ఇన్‌చార్జి ఎస్సై ఆర్. శంకర్ తెలిపారు.

రబీ కొనుగోళ్లకు రంగం సిద్ధం



- జిల్లాలో 308 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు
- 40,060 లక్షల గన్నీ బ్యాగుల సేకరణకు ప్రతిపాదనలు
- ఏర్పాట్లలో తలమునకలైన పౌర సరఫరాల శాఖ

నిర్మల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రబీసీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు కోసం సంబంధిత అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లలో తలమునకలవుతోంది. ధాన్యం కొనుగోలుకు సంబంధించి కలెక్టర్ అభిలాష అభినవ్, అడిషనల్ కలెక్టర్ కిషోర్‌కుమార్‌లు ఇప్పటికే సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఏర్పాట్లకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. మొత్తం జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి 1లక్ష62వేల414 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో నుంచి 24,506 మెట్రిక్ టన్నుల సన్నరకం బియ్యం కాగా 1లక్ష37వేల908 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ యాసంగి సీజన్‌లో జిల్లా రైతులు 1లక్ష17వేల085 ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. ఇదిలా ఉండగా జిల్లావ్యాప్తంగా మొత్తం 308 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇదిలా ఉండగా 189 కేంద్రాల్లో దొడ్డు రకం ధాన్యాన్ని 119 కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా గత సంవత్సరం 2023-2024 రబీసీజన్‌కు గానూ రైతుల నుంచి 1లక్ష57వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అయితే కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పంట నాణ్యత విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కల్పించవద్దని, అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను సమకూర్చాలంటూ కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు. పౌరసరఫరాలశాఖ అధికారులు మొత్తం 308 కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలతో పాటు ఇతర అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టారు.



ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

• గన్నీ బ్యాగులే కీలకం

కాగా రైతుల నుంచి కొనుగోలు చేసే ధాన్యం కోసం అవసరం అయ్యే గన్నీ బ్యాగుల సమస్య ప్రతీయేటా అధికారులకు తలనొప్పిగా మారుతోంది. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యానికి సరిపడా గన్నీబ్యాగులు అందుబాటులో లేకపోవడంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ సారి రబీ సీజన్‌కు గానూ గన్నీబ్యాగుల కొరత తలెత్తకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం 40లక్షల60వేల గన్నీ బ్యాగులు అవసరం కానున్నట్లు అధికారులు నిర్ధారించారు. అయితే ప్రస్తుతం మాత్రం జిల్లాలో 12లక్షల60వేల గన్నీ బ్యాగులు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు మిగతా 28లక్షల గన్నీ బ్యాగులు జిల్లాకు కొద్ది రోజుల్లోనే తీసుకువచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు మొదలుపెట్టారు. రబీ సీజన్‌లో ఎట్టి పరిస్థితుల్లోనైనా గన్నీ బ్యాగులు కొరత తలెత్తకుండా ఇప్పటికే ఆ దిశగా సేకరణ ప్రక్రియ తీవ్రమైందని అధికారులు పేర్కొంటున్నారు.

• మద్దతు ధరతోనే..

జిల్లాలో ఏర్పాటు చేయనున్న 308 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరను చెల్లించనున్నారు. దొడ్డు రకానికి సంబంధించి 189 కొనుగోలు కేంద్రాల్లో కామన్ రకానికి సంబంధించిన ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2300 చెల్లించనున్నారు. అలాగే 119 సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గ్రేడ్ ఏ రకం ధాన్యానికి 2320 రూపాయలను చెల్లించనున్నారు. ధాన్యం చెల్లింపులకు సంబంధించి ఎప్పటికప్పుడు సాంకేతిక ప్రక్రియను వేగంగా చేపట్టేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు తూకం విషయంలో కూడా ఖచ్చితత్వాన్ని పాటించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. అలాగే తేమ విషయంలో కూడా ఖచ్చితత్వాన్ని పాటించాలని రైతులను అనవసరంగా ఇబ్బందులకు గురి కాకుండా చూడాలంటూ అధికారులు కొనుగోలు కేంద్రాల సిబ్బందికి సూచనలు జారీ చేశారు.

• పోటాపోటీగా ధాన్యం సాగు

కాగా రైతులు ఖరీఫ్ సీజన్‌ను తలదన్నే విధంగా రబీసీజన్‌లో కూడా ధాన్యం సాగుకే ఎక్కువ మొగ్గు చూపారు. 1లక్ష17వేల085 ఎకరాల్లో రైతులు ధాన్యం పంటను సాగు చేశారు. ప్రాజెక్టుల్లోనూ, చెరువుల్లోనూ పుష్కలంగా సాగునీరు అందుబాటులో ఉండడంతో రైతులు వరి పంట వైపే మొగ్గు చూపారు. అయితే ఈ సారి 1లక్ష62వేల414 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు రానున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ధాన్యం పంట తరువాత రైతులు మొక్కజొన్న పంటను కూడా లక్ష ఎకరాలకు పైగా సాగు చేశారు. రబీసీజన్‌లోనే ధాన్యం కొనుగోళ్ల కోసం దాదాపు 308 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఈ సారి కూడా దొడ్డురకం, సన్నరకం ధాన్యానికి వేరు వేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.



ధర్మపురికి ప్రత్యేక బస్సులు : డీఎం

నిర్మల్ కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ నుండి ధర్మపురి పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అక్కడ జరిగే లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం, డోలోత్సవం, రథోత్సవాలకు భక్తులు హాజరయ్యే విధంగా బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలకు మహాలక్ష్మి పథకం వర్తిస్తుందన్నారు.

వాహనాల తనిఖీ

ముథోల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తరోడా, చించాల గ్రామాల మధ్య మంగళవారం ముథోల్ ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. వాహనదారులు సంబంధిత వాహనపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి వదిలిపెట్టారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై శ్రావణి, పోలీసు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

నర్సాపూర్(జి), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి గుండా ప్రయాణం చేసే వాహనదారులు రహదారి నియమాలు పాటించాలని నర్సాపూర్(జి) ఎస్సై సాయికిరణ్ సూచించారు. మంగళవారం పోలీసు సిబ్బంది పోలీసుస్టేషన్ ముందర వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సాయికిరణ్ మాట్లాడుతూ... వాహనదారులు రహదారిపై ప్రయాణించే సమయంలో వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. దీంతో పాటుగా రహదారిపై తమకు కేటాయించిన వరుసలో ప్రయాణికులు ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ఇక వాహనలపై పెండింగ్ చలాన్లు ఉంటే వాటిని మీ సేవ కేంద్రాల్లో చెల్లించుకోవాలని సూచించారు. ఇక భారీ వాహనాలు రహదారిపై సూచించిన విధంగా వాహనాలు నడపడంతో పాటు గ్రామాల జంక్షన్‌ల వద్ద జాగ్రత్తగా చూసుకొని డ్రైవింగ్ చేయాలని సూచించారు.

ప్రార్థన స్థలాల్లో పారిశుద్ధ్య పనులు



నర్సాపూర్(జి), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ప్రార్థన స్థలాల్లో కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మండలంలోని చాక్‌పల్లి జామ మస్జిద్ పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. కలెక్టర్ ఆదేశాలనుసారం పనులు చేపట్టినట్లు ఎంపీవో తిరుపతిరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్ తెలిపారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

• కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



సమావేశానికి హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎల్ఆర్ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుల పరిష్కారంపై పంచాయతీ, మున్సిపల్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఈ నెల 31వ తేదీలోపు పూర్తి ఫీజు చెల్లిస్తేనే 25 శాతం రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 46 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే అధికారులకు దరఖాస్తుల పరిష్కారంపై అవగాహన, శిక్షణలు అందించడం జరిగిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎల్ఆర్ఎల్ ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, లోకల్ టీవీ ఛానల్‌లలో ప్రచారం నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో టాంటాం నిర్వహించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంపై రోజువారి రిపోర్టులను అందజేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం త్వరితగతిన జరిగి, ప్రజలకు లబ్ధి చేకూరేలా చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, రాజేష్ కుమార్, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మహిళల ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయి

నిర్మల్ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మహిళల ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం కొండాపూర్ సమీపంలోని నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన మహిళల ప్రత్యేక క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంచే గొప్ప సాధనంగా నిలుస్తాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. విజయం సాధించినవారు విజయాన్ని మరింత ప్రేరణగా తీసుకుని ముందుకు సాగాలని, అలాగే ఇతర క్రీడాకారులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు ఈ అనుభవాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తున్నారన్నారు. మహిళల క్రీడా ప్రోత్సాహానికి జిల్లాలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన మహిళలకు కలెక్టర్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్న కళ్యాణి, జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, మహిళా ఉద్యోగులు, నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్స్ నందకుమార్, పోతన్న, కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందిస్తాం

కడెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం కడెం మండలం కొత్త మద్దిపడగ గ్రామ శివారు పంట పొలాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి వివరాలను రైతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతులు సాగు చేసిన పంటలకు కడెం ప్రాజెక్టు సదర్మాట్ కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు అవసరమైన మేరకు నీటిని అందిస్తామని తెలిపారు. సాగునీటి విషయంలో రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి పంట పొలానికి ఏప్రిల్ చివరి నాటికి సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, నీటి పారుదల శాఖ ఈఈ విఠల్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు పోటీపడి విధులు నిర్వర్తించాలి

• సబ్ డివిజన్ ఆఫీస్, గ్రామీణ పోలీసుస్టేషన్ తనిఖీలో ఎస్పీ



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ

నిర్మల్ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : అధికారులు, సిబ్బంది పోటీపడి విధులు నిర్వర్తించాలని ఎస్పీ డా.జానకీషర్మిల ఆదేశించారు. మంగళవారం నిర్మల్ సబ్ డివిజనల్ ఆఫీస్, గ్రామీణ పోలీసుస్టేషన్ రికార్డులను వార్షిక తనిఖీ చేశారు. నామినల్‌రోల్స్‌ను పరిశీలించి హెచ్‌ఆర్ఎంఎస్ తనిఖీచేసి హెచ్‌ఆర్ఎంఎస్‌లో నియుక్తం చేసిన డ్యూటీల ప్రకారం పట్టిక ఉండాలని తెలిపారు. పోలీసుస్టేషన్ పరిధిలో ఏ తరహా కేసులు ఎక్కువ నమోదవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న సీడీ ఫైల్స్‌ను, పెండింగ్ ట్రాయల్‌లో ఉన్న సీడీ ఫైళ్లను, గ్రేవ్ కేసెస్‌లలో ఉన్న సీడీ ఫైళ్లను పరిశీలించారు. సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... అంకితభావంతో విధులు నిర్వహించే వారికి రివార్డులు, అవార్డులు ప్రతీనెలా ఇస్తామన్నారు. సిబ్బంది ఇచ్చిన బాధ్యతల పరంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు, వారు నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందు బాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుని తక్షణ సేవలు అందించాలన్నారు. రౌడీలు, కేడీలు, అనుమానాస్పదంగా ఉన్న సంఘవిద్రోహశక్తులపై నిరంతరం నిఘా ఉంచి, వారి కదలికలను గమనించాలని, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులపై ప్రత్యేకనిఘా ఉంచాలని సూచించారు. రాత్రి పెట్రోలింగ్ అధికారులు పాత నేరస్తులను తనిఖీ చేయాలని తెలిపారు. ప్రజల రక్షణ గురించి ఎల్లవేళలా అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరికీ తెలిసి ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి క్రైమ్ రేటు తగ్గించాలన్నారు. ప్రతీ కేసులో ఖచ్చితమైన ఇన్వెస్టిగేషన్ ఉండాలని కేసులలో వందశాతం పరిష్కారం సాధించాలని అధికారులు, సిబ్బంది ప్రొయాక్టివ్ పోలీసింగ్ విధులు నిర్వహించాలన్నారు. పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే హెచ్‌ఆర్ఎంఎస్ గ్రీవెన్స్ సెల్ ద్వారా పంపించాలని సూచించారు. అనంతరం సబ్ డివిజన్ ఆఫీస్ రికార్డ్స్ కూడా పరిశీలించటం జరిగింది. గ్రేవ్ కేసుల వివరాలు, పోక్స్ కేసుల వివరాలు వాటి రికార్డ్స్ పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ పోలీస్ అధికారులతో కలిసి మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేష్ మీనా ఐపీఎస్, నిర్మల్ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కృష్ణ, ఎస్ఐ లింబాద్రి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలకే పరిమితమైన కాంగ్రెస్ ప్రభుత్వం

• బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



మామడలో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

మామడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా పూర్తిగా నెరవేర్చలేదని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలానికి చెందిన 69 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల మోడల్ హౌస్ భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి ఆడబిడ్డ పెళ్లికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తానని మాట తప్పిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణగౌడ్, సరికెల గంగన్న, బాపురెడ్డి, కోండ్ర రాజారెడ్డి, మండల అధ్యక్షులు రంజిత్‌కుమార్, మాజీ ఎంపీటీసీ నవీన్, చక్రపాణి గంగాధర్, నాయకులు ఏలేటి లింగారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వెంకటేశ్వర్ రావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాందలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

లక్ష్మణచాంద, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. పొట్టపెల్లి(కె) గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.2.5 లక్షలతో నిర్మించే దుర్గామాత షెడ్డు నిర్మాణం కోసం, లక్ష్మణచాంద మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో రూ.5 లక్షలతో నిర్మించే ఇందిరమ్మ మోడల్ హౌస్ కోసం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధారాథోడ్, నాయకులు నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, అయిండ్ల భూపాల్‌రెడ్డి, భాజపా పార్టీ మండల అధ్యక్షులు గాండ్ల చిన్నయ్య, జిల్లా నాయకులు అడ్వాల రమేష్, మాజీ సర్పంచ్‌లు సురకంటి ముత్యంరెడ్డి, జీవన్‌రెడ్డి, రవి, రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీలు రాజేశ్వర్, నర్సారెడ్డి మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం నూతన భవన ప్రారంభం

సోన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ సమగ్ర శిక్షా అభియాన్ నిధులు రూ. 4.15 కోట్లతో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం నూతన భవనాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం కేజీబీవీ భవన ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నేరడిగొండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల వడ్డెర కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మంగళవారం నేరడిగొండ మండల వడ్డెర సంఘం నాయకులు ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. అనంతరం వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తేగా తప్పకుండా వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వారిలో బొంతుకుల శ్రీను, కుంచపు గోవింద్, గోగుల సీతారాం, బోదాసు నరేష్, శివరాత్రి శేఖర్, మల్లేష్, బోదాసు రవి, రాములు, హనుమంతు, సాయిలు, నర్సయ్య, పోశెట్టి, నర్సింలు, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయండి

తలమడుగు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిర మ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో భాగంగా లబ్ధిదారులకు రూ.ఐదు లక్షలతో నిర్మిస్తున్న మోడల్ హౌస్ నిర్మాణ పనులను మండల కేంద్రంలో ప్రారంభించడంతో వీటి పనులు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ శాఖ అధికారులకు కోరారు. అదేవిధంగా మండలంలో నూతనంగా ప్రారంభించనున్న ఇండ్ల నిర్మాణ పనులకు, ప్రభుత్వ ఆదేశాలమే ఇసుకను అందించడం జరుగుతుందన్నారు. అనంతరం మోడల్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ నసీర్, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి

తాంసి మార్చి 11(ఆంధ్రజ్యోతి): మాల మహార్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. సంఘం అధ్యక్షుడు మొట్టే ప్రదీప్ మాట్లాడుతూ విద్యా ద్వారా బలహీన వర్గాలకు విముక్తి లభిస్తుందని, పేద విద్యార్థులకు, మహిళల హక్కుల కోసం పోరాడిన క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే అని అన్నారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మొట్టే ప్రదీప్, సంఘ సభ్యులు గంపల సుధాకర్, పాటిల్ అనిల్, ఎస్.జశ్వంత్, గంపల్లి భూమన్న, కామెరి శ్రీనివాస్, తదితరు పాల్గొన్నారు.

ఉట్నూర్‌లో ఎమ్మార్పీఎస్ నిరసన దీక్ష

ఉట్నూర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): టీపీఎస్సీ ఆధ్వర్యంలోని గ్రూప్ 1, 2,3 పోస్టుల భర్తీని ఎస్సీ వర్గీకరణ అయ్యేంత వరకు నిలుపుదల చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బాలాజి మాదిగ మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగ నోటిఫికేసన్‌కు ఎస్సీ వర్గీకరణ వర్తించేలా చట్టం తేవాలన్నారు. ఉద్యోగ నియమకాల్లో మాదిగలకు, మాదిగ ఉప కులాలకు ద్రోహం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నందున మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బుధవారం నుంచి ప్రారంభం కానున్న శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చట్టం చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన నోటిఫికేషన్‌లకు వర్తించేలా చట్టంలో రూపకల్పన చేయాలన్నారు. ఇందులో గజ్జల కాంతారావు, రాంప్రసాద్, అశోక్, బాలాజి, మోరేవిష్ణు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

బోథ్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కల వాడ కరత్వాడ గ్రామాలలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీవో రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా వేసవికాలంలో తీసుకోవాలసిన జాగ్రత్తలను కూలీలకు వివరించారు. ఉదయం నుండి తొమ్మిది గంటల లోపు పనులను ముగించుకోవాలని సూచించారు. ఎండ సమయంలో ఎక్కువగా మంచినీటి తాగాలని కూలీలకు సూచించారు. ఎంపీడీవో వెంట టీఏ చంద్రశేఖర్, మధుకర్, ఎస్ఏ రాములు పాల్గొన్నారు.

పాత ఫోన్లు అమ్మేస్తున్నారా? తస్మాత్ జాగ్రత్త!

● భారీ సైబర్ స్కెచ్.. భగ్నం ● బిహార్ ముఠా గుట్టు రట్టు ● ఐదుగురి అరెస్టు.. ఫోన్‌లు, ద్విచక్ర వాహనాల స్వాధీనం
● పరారీలో బిహార్ గ్యాంగ్ లీడర్ ● వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్


స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పాత ఫోన్‌లు అమ్మేస్తున్నారా? తస్మాత్ జాగ్రత్త..!! అంటున్నారు పోలీసులు. పాత ఫోన్‌లు కొంటాం.. పాత ఫోన్‌లకు టిఫిన్ బాక్సులు, గృహోపకరణ వస్తువులు ఇస్తాం అంటూ.. బైక్‌పై అపరిచిత వ్యక్తులు కాలనీల్లో ఇళ్ల వద్దకు వస్తున్న వారికి మీ పాత ఫోన్‌లను ఇచ్చేస్తే.. మీరు ఇరకాటంలో పడినట్లే. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాకేంద్రంలోని రిక్షా కాలనీలో పాత సామాన్‌లు కొనుగోలు చేసే రీతిలో ఓ ముఠా పాత మొబైల్ ఫోన్‌లు కొంటామని మోటార్ బైక్‌లపై సంచరిస్తుండగా.. ఆదిలాబాద్ టూ టౌన్ పోలీసులు అనుమానంతో వల పన్ని పట్టుకున్నారు. వీరు పాత సెల్‌ఫోన్‌లు సిమ్ కార్డులను సేకరించి వాటితో భారీ సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. వీరు సైబర్ నేరాలకు పాల్పడాలనే భారీ కుట్రను పోలీసులు భగ్నం చేశారు. ఐదుగురు బిహారి నిందితులతో పాటు వారి వద్ద పెద్ద సెల్‌ఫోన్స్, సిమ్ కార్డులు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా మంగళవారం ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలను వెల్లడించారు. బిహార్‌కు చెందిన ఆరుగురు తబరక్, మహ్మద్ మేరాజులు, మహబూబ్ ఆలం, మహ్మద్ జమల్, ఎండీ ఉజీర్, అబ్దుల్లాలు ముఠాగా ఏర్పడి సైబర్ నేరాలకు పాల్పడానికి ప్లాన్ వేసుకున్నారన్నారు. తబరక్ మినహా మిగతా ఐదుగురు గ్రామాల్లో తిరుగుతూ పాత సెల్‌ఫోన్‌లను తీసుకుంటూ వాటి స్థానంలో టిఫిన్ బాక్సులను అందిస్తూ సేకరిస్తున్నారని పేర్కొన్నారు. ఇది వరకే వీరు కర్ణాటకలో 12 వేల సెల్ ఫోన్‌లను సేకరించి సైబర్ నేరాలకు పాల్పడినట్టు గుర్తించామన్నారు. ప్రజలు అనుమానితులకు పాత ఫోన్‌లను అమ్మవద్దని, తెలిసిన వారి దగ్గర కొనాలన్నారు. సెల్‌ఫోన్‌తో పాటు సిమ్‌లు కొంత మంది ప్రజలు వీరికి విక్రయించారని తెలిపారు. ఆ సిమ్, ఫోన్‌లతోనే అమయాక ప్రజలను మోసం చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. నేరానికి ఉపయోగిస్తూ.. అమయాకులను ఇరుకున పడేస్తున్నారన్నారు. వీరి కుట్రలను టూ టౌన్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్నారని తెలిపారు. ఏ-వన్ నిందితుడు తబరక్ పరారీలో ఉండగా.. మిగతా ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి 2,125 పాత సెల్‌ఫోన్‌లు, 107 సిమ్ కార్డులు, ఐదు బిహార్‌కి చెందిన ద్విచక్ర వాహనాలు, 800 మొబైల్ బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. సమావేశంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, టూ టౌన్ సీఐ కరుణాకర్ రావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

● పాత ఫోన్‌లతో.. సైబర్ స్కాం

ప్రస్తుతం పాత మొబైల్ ఫోన్‌లకు డిమాండ్ తగ్గిపోవడంతో ప్రజలను బురిడీ కొట్టించేందుకు ఓ బిహారి ముఠా నయా మోసాలకు తెరలేపింది. వీరు మోటార్ బైక్‌లపై తిరుగుతూ పాత సెల్‌ఫోన్‌లు, సిమ్ కార్డులు ఇస్తే దీనికి బదులుగా ప్లాస్టిక్ డబ్బాలు, గృహోపకరణాలు ఇస్తామని నమ్మిస్తూ సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. సేకరించిన మొబైల్ ఫోన్, సిమ్ కార్డ్‌లను వినియోగించి ఉద్యోగాలు ఇస్తామని, మరి కొందరికి లాటరీ తగిలిందని, బ్యాంకు ఖాతా చెప్పాలని ఓటీపీ సేకరించి భారీ మోసాలకు పాల్పడుతున్నారు. అంతేకాకుండా, ఒక్క కర్ణాటక రాష్ట్రంలోనే పది వేల పాత ఫోన్‌లు వినియోగించి సైబర్ క్రైమ్‌లకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సైబర్ మోసాల వలలో చిక్కిన బాధితులు భారీ ఎత్తున ఆర్థికంగా నష్టపోయినట్లు పోలీసులు తెలిపారు.

పెట్రోలింగ్, గస్తీ నిర్వహిస్తూ నేర నియంత్రణ చేపట్టాలి : ఆదిలాబాద్ ఎస్పీ

మావల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మావల, ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లను మంగళవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా జిల్లా ఎస్పీకి రూరల్ సీఐ కె.ఫణీంధర్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈ మేరకు ఎస్పీ పోలీస్‌స్టేషన్ పరిసరాలలో ఒక మొక్క నాటి, పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా రెండు పోలీస్‌స్టేషన్‌ల పరిసరాలను కేటాయించిన స్థలాన్ని సరిహద్దుగా ఉన్న పోలీస్‌స్టేషన్ల వివరాలను పోలీస్‌స్టేషన్ పరిధిని పూర్తి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు ధ్రువీకరిస్తూ ఉండాలని తెలిపారు. అదేవిధంగా నేరాల నియంత్రణ కోసం పెట్రోలింగ్ గస్తీ నిర్వహిస్తూ రౌడీ షీట్లను పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ గ్రామీణ సీఐ కె.ఫణీందర్, ఎస్సైలు ముజాహిద్, గౌతమ్, పీర్‌సింగ్ నాయక్, మావల, రూరల్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో ఏసీబీకి చిక్కిన డీఈఈ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో ఏసీబీ వలకు ఓ అవినీతి అధికారి చిక్కాడు. జిల్లా కేంద్రంలోని విద్యా అండ్ సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(ఈడబ్ల్యూఐడీసీ) డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జిన్నంవార్ శంకర్ ఓ సబ్ కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేల లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. డీఈఈను నుంచి రూ.50 వేలు స్వాధీనం చేసుకుని ఆ అవినీతి అధికారిని కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పర్చనున్నట్లు డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. ఆదిలాబాద్ పట్టణంలోని ఈడబ్ల్యూఐడీసీ కార్యాలయంలో డీఈఈగా పనిచేస్తున్న శంకర్ బిల్లులు కోసం ఓ సబ్ కాంట్రాక్టర్‌ను ఇబ్బందులకు గురిచేశాడు. పట్టణంలోని కేంద్రీయ విద్యాలయ స్కూల్ ప్రక్కన.. మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణం చేపడుతున్నారు. దీనిని సబ్ కాంట్రాక్టర్‌గా ఆదిలాబాద్‌కు చెందిన పీవీ నారాయణ నిర్మాణం చేపడుతున్నారు. కాగా పూర్తయిన నిర్మాణానికి రూ.2 కోట్లు బిల్లు మంజూరు కాగా, ఆ బిల్లు కోసం డీఈఈ రూ.2 లక్షలు కమీషన్ ఇవ్వాలని అడిగాడు. దీంతో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకర్‌కు రూ. 50 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలించారు.

ముంచుకొస్తున్న.. ముప్పు కాలం!

(5వ పేజీ తరువాయి...)

ఉంది. ఇప్పటికే ఈ నియోజక వర్గంలోని ఇచ్చోడలో అగ్నిమాపక కేంద్రం కొనసాగుతోంది. దీంతో బోథ్‌లో మరొక అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇచ్చోడకు బోథ్ సుమారుగా 20కి.మీ.లకు పైగా దూరంలో ఉండడంతో కొత్త అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు అనుమానమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఆదిలాబాద్ నియోజకవర్గంలోని బేలలో కొత్త అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్థానికుల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన స్పందన కనిపించడం లేదంటున్నారు. ప్రతీసారి ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు హామీలు ఇవ్వడం.. ఆ తర్వాత మరిచిపోవడంతో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతూ వస్తుంది.

పసికందును పడేసిన గుర్తుతెలియని వ్యక్తులు

గుడిహత్నూర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఓ నవజాత శిశువును గుర్తుతెలియని వ్యక్తులు వాగులో పడేసి వెళ్లిపోయారు. దీంతో అప్పుడే పుట్టి కళ్లు కూడా తెరవకముందే ఆ పసికందు కానరాని లోకాలకు వెళ్లిపోయింది. ఈ హృదయ విచారకరమైన ఘటన మండలంలోని గురుజ గ్రామంలో జరిగింది. మంగళ వారం తెల్లవారుజామున ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన మగ పసికందును వాగులో పడేశారు. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి పోలీ సులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ఇచ్చోడ సిఐ భీమేష్, ఎస్సై మహేందర్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. పసికందు మృత దేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వ్యక్తులు ఎవరూ అనే కోణంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. చుట్టుపక్కల వ్యక్తులను విచారిస్తున్నారు. ఆసుపత్రిలో జరిగిన డెలివరీల వివరాలు కూడా సేకరిస్తున్నా మని ఎస్సై తెలిపారు.

'దన్నూర్ పాఠశాల హెచ్‌ఎంపై విచారణ పూర్తి'

బోథ్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దన్నూర్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై విచారణ పూర్తి చేసి జిల్లా విద్యాశాఖ అధికారికి పంపించడం జరిగిందని మండల విద్యాధికారి మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. మంగళవారం ఆయన మండల విద్యాధికారి కార్యాలయంలో మండలకేంద్రంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణల విషయమై గ్రామానికి వెళ్లి విచారణ జరపడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ విచారణలో విద్యార్థులతో పాటు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులను కలిసి మాట్లాడడం జరిగిందన్నారు. అయితే ప్రధానోపాధ్యాయుడు విధులకు ఆలస్యంగా రావడం వెనక కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు అయినందున.. కొన్ని పాఠశాలలు తనిఖీ చేయాల్సి ఉంటుందని, అందువల్ల ఆలస్యం అవుతుందన్న విషయాన్ని గ్రామ అభివృద్ధి కమిటీ వారికి వివరించడం జరిగిందని ఆయన తెలిపారు. అంతేకాక పాఠశాలలోని విద్యా బోధనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారంటూ విద్యార్థులు తెలిపారు. ఈ నివేదికను డీఈవోకు పంపించామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాగా ప్రధానోపాధ్యాయుడిపై ఆరోపణలు చేసిన వారే 'మా సార్ మంచోడంటూ' కితాబ్ ఇవ్వడం వెనుక మతలబు ఏమిటని పలువురు అంటున్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్

ఇచ్చోడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదివే విద్యార్థి లాలిత్య ఆదివారం రాత్రి మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ మంగళవారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యావ్యవస్థ ఎటు వెళ్తోందని, విద్యార్థులపై చిత్తశుద్ధి లేదన్నారు. విద్యార్థి మృతికి కారణాలను అడిగి తెలుకున్నారు. రాత్రి సమయంలో ఉపాధ్యాయులు, వార్డెన్ విధి నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు తహారే రమేష్, నాయకులు శివ, గణేష్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

పీజీ కళాశాల ఏర్పాటుకు

అంకితభావంతో కృషి చేస్తా

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని విద్యార్థుల ప్రయోజనార్థం భైంసాలో పీజీ కళాశాల ఏర్పాటుకు బాధ్యతాయుతమైన విధానాల ద్వారా అంకితభావంతో పాటుపడుతానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ వెల్లడించారు. మంగళవారం భైంసాలోని గోపాల్‌రావ్ పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఎం ఉషా పథకం కింద మంజూరైన నిధులతో అధనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇక్కడి డిగ్రీ కళాశాలలో అధునిక వసతుల కల్పనతో పాటు అన్ని రకాల సౌకర్యాల మెరుగుదల కోసం గాను పీఎం ఉషా పథకం ద్వారా రూ.5 కోట్లు మంజూరైనట్లుగా వివరించారు. సంబంధిత నిధుల ద్వారా కళాశాలలో అధనపు గదుల నిర్మాణం, డిజిటల్ విద్యాబోధనకు ఏర్పాట్లు, అదునాతన లైబ్రరీ, కంప్యూటర్లు, ల్యాబ్‌లు సమకూరనున్నాయని వివరించారు. తద్వారా గోపాల్‌రావ్ పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆదర్శంగా తీర్చిదిద్ది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం బాటలు వేస్తామని వెల్లడించారు. రానున్న రోజుల్లో భైంసాలో పీజీ కళాశాల ఏర్పాటే లక్ష్యంగా పెట్టుకొని ఇందుకు అనుగుణంగా ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా ముందుకు సాగుతున్నానని వెల్లడించారు. నియోజక వర్గ పరిధిలో విద్య, వైద్య రంగాలను పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో అధనపు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఇందులో కళాశాల ప్రిన్సిపల్ కర్రొల్ల బుచ్చయ్య, ఐడీ కళాశాల ప్రిన్సిపల్ డా. ఎం.సుధాకర్, సీపీడీసీ అధ్యక్షులు డా. నగేష్, మాజీ మున్సిపల్ చైర్మెన్ బి.గంగాధర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పది పరీక్షలు కాపీ కొట్టకుండా రాయాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

సోన్, మార్చి 11 9ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ జడ్పీఎస్ఎస్ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి సందర్శించారు. ఇందులో భాగంగా 9వ తరగతి విద్యార్థుల ప్రగతిని నివేదికలను సమీక్షించారు. 10వ తరగతి విద్యార్థులను ఒక్కొక్కరిని వారి ప్రగతిని అడిగి తెలుసుకుంటూ 1 నుండి 10వ తరగతి వరకు మొత్తం ఎన్ని రోజులు పాఠశాలకు వచ్చారని అందులో ఎన్ని గంటలు పరీక్షలు రాస్తున్నారో తెలియజేస్తూ, ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా సొంతంగా పరీక్షలు రాస్తూ అందరూ మంచి ఫలితాలను సాధించి జిల్లాకు మంచిపేరు తేవాలని మార్గదర్శనం చేశారు. అదేవిధంగా విషయాల వారీగా సిలబస్ గురించి కూడా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. తరగతుల వారీగా విద్యార్థుల హాజరు కూడా పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించి, మెనూ ప్రకారం ఉండాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. 9, 10వ తరగతి విద్యార్థులకు వారు సాధించిన మార్కులు గ్రేడ్‌లను డిస్‌ప్లే చేయాలని డీఈవో సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మెనూ అమలయ్యేలా చూడాలి

నిర్మల్ కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మెనూ పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఛాత్ర యువ సంఘర్షణ సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.అరవింద్ డిమాండ్ చేశారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వసతి గృహాల్లో వంట సామాగ్రి సరిపడా లేదని, సొంత భవనాలు, మౌలిక వసతులు కరువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వసతి గృహాలను నిర్లక్ష్యం చేస్తున్నారని సమయానికి రావడం లేదని ఆరోపించారు. ప్యాకెట్ మనీ నెలకు 1200ల రూపాయలు చెల్లించాలని, అన్ని సమస్యల పరిష్కారానికి కమిటీ వేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


అడవి సారంగాపూర్‌లో ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే


దస్తురాబాద్‌లో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

ఖానాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 58 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని అడవి సారంగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ వేరువేరు కార్యక్రమాలను ఉద్దేశించి ప్రసంగించిన ఎమ్మెల్యే తమ ప్రభుత్వం రాష్ట్రంలో నిరుపేదలకు అండగా ఉంటుందన్నారు. వచ్చిన హామీలను అమలు చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఈ వేరువేరు కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడార్ల గంగా నర్సయ్య, జిల్లా నాయకులు జన్నారపు శంకర్, పోలంపల్లి సచిన్, జంగిలి శంకర్, కావలి సంతోష్, ద్యావతి రాజేశ్వర్, సార్ల నర్సయ్య, గుడాల రాజన్న, తదితరులున్నారు.

కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

దస్తురాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా ప్రత్యేక ప్రణాళికలను ప్రభుత్వం రూపొందిస్తుందని పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో 2 కోట్ల 30 లక్షల వ్యయంతో నిర్మించనున్న కేజీబీవీ కళాశాల నూతన భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తుందని తెలిపారు. కళాశాలల అభివృద్ధికి కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని అన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. పేదరికాన్ని నిర్మూలించే ఏకైక ఆయుధం చదువు అని, ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం రైతు వేదికలో 30 మంది లబ్ధిదారులకు 30 లక్షల విలువైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. పేదలకు మేలు చేకూరేలా ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. పేదింటి ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మి పథకం ఆర్థికంగా ఎంతో చేయూతను అందిస్తోందన్నారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో భాగంగా దస్తురాబాద్‌కు వెళ్లే మార్గమధ్యంలో పెర్కపల్లె గ్రామంలో టు వీలర్ మీద వెళ్తున్న వాహనదారులకు మేకలు అడ్డం రావడంతో వారు వాహనం నుండి క్రింద పడిపోయారు. వారికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మంచి నీటిని అందించి, వారి బాగోగుల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎంపీడీవో కే. రమేష్, డీటీ యాదవ్‌రావు, ఆర్ఐ రచన, ఎంఈవో గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్, యూత్ అధ్యక్షుడు గుండా నరేష్, నాయకులు కిషన్, రమేష్‌రావు, శివయ్య, అంజన్న, వెంకన్న, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన నిర్మల్ ఎమ్మెల్యే

సోన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండలానికి చెందిన 59 కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో పెళ్లి అయిన ఆడబిడ్డలకు రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మార గంగారెడ్డి, మాజీ ఎంపీపీలు నరికెల గంగన్న, హరీష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ద్వారకామాయి ఆగ్రో ఇండస్ట్రీస్ యాజమాన్యంపై కేసు నమోదు

● ఎన్‌టీసీ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించిన వైనం ● విచారణకు సహకరించాలి : రూరల్ సీఐ కృష్ణ

నర్సాపూర్(జి), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్లి(కే) గ్రామ సమీపంలో గల ద్వారకామాయి ఆగ్రో ఇండస్ట్రీస్ ఫిబ్రవరి నెల 24వ తేదీన సివిల్ సప్లై అధికారులు ఫిజికల్ వెరిఫికేషన్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ఎస్. రమాదేవి ఫిజికల్ వెరిఫికేషన్ నిర్వహించగా రైస్ మిల్లు ఆవరణలో ధాన్యం స్టాక్ లేకపోవడంతో ప్రభుత్వానికి అందవలసిన స్టాక్‌ను నిర్ణీత సమయంలో అందించకుండా ఉండడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ద్వారకామాయి ఆగ్రో ఇండస్ట్రీస్ కల్లూర్‌పై జిల్లా మేనేజర్ గెడం గోపాల్ 8వ తేదీ శనివారం నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని ప్రొపరేటర్ రుక్మిణి, నిర్వాహకుడు తుర్పాటి వెంకటేష్‌కు 41ఏ నోటీసులు అందజేశారు. తెలంగాణ ప్రోక్యుర్మెంట్ పాలసీ కస్టమ్ మిల్లింగ్ నియమ నిబంధనలకు తుంగలో తొక్కి ప్రభుత్వానికి రావలసిన 11006.090 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇవ్వకపోవడంతో 48,85,81,589 రూపాయల ధాన్యం నిబంధల ప్రకారం ప్రభుత్వానికి అందించకపోవడంతో వారిపై ఎనిమిదవ తేదీ శనివారం నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గెడం గోపాల్ తెలిపారు.

విచారణకు సహకరించాలి : గ్రామీణ సీఐ కృష్ణ

8వ తేదీ శనివారం సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గెడం గోపాల్ ఫిర్యాదు చేయడంతో నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ధాన్యానికి సంబంధించిన ట్రక్ షీట్లు, రైస్‌మిల్ ప్రాపర్టీ లైసెన్స్ నిర్వాహకులు ఎవరు రైస్‌మిల్ బౌండరీస్ సంబంధించిన సమాచారం ఇవ్వాలని జిల్లా సివిల్ సప్లై అధికారులకు నోటీసులు అందించామని తెలిపారు. ఏ1 తుర్పాటి రుక్మిణీ, ఏ2 తుర్పాటి వెంకటేష్‌కు 41ఏ నోటీసులు అందించామని తెలిపారు. విచారణకు సహకరించాలని నోటీసులో పేర్కొన్నట్లు తెలిపారు. విచారణకు సహకరించకపోతే న్యాయస్థానంలో తమ వాదనలు వినిపిస్తామని తెలిపారు.

ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

దిలావర్‌పూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని డీఆర్‌డీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో జిల్లాలోని ఏపీఎంలకు, సీసీలకు మానవ అక్రమ రవాణా చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడారు. ఈ చట్టంపై జిల్లాలోని గ్రామాల్లోని వీవోఏలకు, స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. భవిష్యత్తులో మహిళలకు, చిన్న పిల్లలకు, కిషోర బాలికలకు స్వీయ రక్షణ చర్యలు, చట్టాలపై అవగాహన కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏపీఎం సులోచన రెడ్డితో పాటు జిల్లాలోని వివిధ మండలాల ఏపీఎంలు పాల్గొన్నారు.

'బాలశక్తి' మరింత బలోపేతం

● రూ. 7.5 లక్షలతో బాలశక్తి పథకానికి వాహనం విరాళం


నిర్మల్ కలెక్టర్‌కు వ్యాన్‌ను అందజేస్తున్న దాత

నిర్మల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం చేపిట్టన బాలశక్తి కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఓదాత తన ఉదారతను ప్రదర్శించాడు. ఏ పని చేసిన ఏదో లాభాన్ని ఆశించి పని చేసే నేటి రోజుల్లో ఎటువంటి లాభం ఆశించకుండా ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఏడున్నర లక్షల రూపాయలను వెచ్చించి ఓ వాహనాన్ని కొనుగోలు చేసి బాలశక్తి కార్యక్రమానికి ఉపయోగించాలని ముందుకు వచ్చిన హైదరాబాద్‌కు చెందిన స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి పలువురికి ఆదర్శంగా నిలిచారు. నిర్మల్ జిల్లాలో బాలశక్తి కార్యక్రమ అమలులో ఉపయోగించేలా హైదరాబాద్‌కు చెందిన స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి రూ. 7.5 లక్షల విలువ చేసే వాహనాన్ని విరాళంగా అందజేశారు. సదరు వాహనాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు అప్పగించారు. నిర్మల్ జిల్లాలోని విద్యార్థులు సామాజిక సంస్థలను సందర్శించేందుకు వీలుగా ఈ వాహనం ఉపయోగపడనుంది. జిల్లాలో బాలశక్తి కార్యక్రమాన్ని బలోపేతం చేసేలా సహకారం అందించిన హర్షవర్ధన్ రెడ్డిని పలువురు అభినందిస్తున్నారు.

భవన నిర్మాణానికి నిధులు కేటాయించండి



నిర్మల్ కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణ కేంద్రంలో కుమ్మరుల సంఘ భవన నిర్మాణానికి నిధులు కేటాయించి సహకరించాలని ఆ సంఘ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి వినతి చేశారు. సంఘ అధ్యక్షుడు కొత్తపల్లి రఘు, ప్రధాన కార్యదర్శి పోతుగంటి సంతోష్, తదితరులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణానికి నిధులు కేటాయింపు, వారి అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. భూసారపు గంగాధర్, టి. శ్రీనివాస్, సతీష్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన

తరగతులు ఐదు.. విద్యార్థులు 11మందే..

● హాజరవుతున్నది నలుగురు విద్యార్థులే.. ● ఇదీ కామటివాడ పాఠశాల పరిస్థితి



కామాట్‌వాడలోని ప్రాథమిక పాఠశాల



హాజరైన ఆ నలుగురు విద్యార్థులు వీరే..

భీంపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల్లేక వెలవెలబోతున్నాయి. విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేస్తున్నామని ప్రభుత్వం చేప్తున్నా వాటిని బలోపేతం చేయడంలో విఫలమవుతోంది. మండలంలోని కామాట్‌వాడ గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉంది. 1 నుంచి 5 వరకు తరగతులకు విద్యార్థులకు విద్యాబోధన చేయాలి. అయితే ఇక్క డ ఈ పాఠశాలలో 11మంది విద్యా ర్థులు మాత్రమే ఉన్నారు. ఈ 11మం ది విద్యార్థులకు విద్యాబోధన కోసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించారు. మంగళవారం ఆ పాఠశాలను 'ఆంధ్రజ్యోతి'ని సందర్శించగా కేవలం నలుగురు విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. పాఠశాలను పరిశీలించేందుకు వచ్చిన 'ఆంధ్రజ్యోతి' విలేకరిని అనుమతులు లేకుండా పాఠశాలకు రావొద్దని, ఫొటోలు తీయవద్దని ఇద్దరు ఉపాధ్యాయులు వాదించారు. పాఠశాల సందర్శనకు ఎవరూ వచ్చినా ఫొటోలు తీయొద్దని డీఈవో ఆదేశాలు ఉన్నాయని ఉపాధ్యాయులు నారాయణ, శ్రీనివాస్‌లు చెప్పారు. దీంతో ఈ విషయమై ఎంఈవో శ్యామ్‌సుందర్‌ను వివరణ కోరగా అలాంటిది ఏమీలేదని పేర్కొన్నారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్త చర్యలు పాటించాలి

● డా.కాశీనాథ్, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి ,భైంసా



భైంసా, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో ఎండల తీవ్రత అధికమవుతోంది. ఈ క్రమంలో మండుటెండల్లో బయట తిరిగేవారు వడదెబ్బ బారిన పడే పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్త చర్యలను భైంసా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కాశీనాథ్ వివరించారు.

ఆంధ్రజ్యోతి: వేసవిలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

అధికారి: ఈఏడాది ఎండల తీవ్రత ఎక్కువ ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో 35 నుంచి 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. వృద్ధులు, చిన్నారులకు ఇది ఇబ్బందికర పరిస్థితి.

ఆంధ్రజ్యోతి: వడదెబ్బకు గురికాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

అధికారి: ఉదయాన్నే తొందరగా పనులు ముగించుకోవాలి. 10గంటల తర్వాత బయటకు వెళ్లకపోవడం మంచిది. తప్పనిసరిగా వెళ్లాల్సివస్తే ఎండ తగలుండా తగిన జాగ్రలు తీసుకోవాలి. స్కార్ఫ్, టోపి, చలువ కళ్లద్దాలు ధరించాలి. ఉప్పు, పంచదార, నిమ్మ కలిపిన మజ్జిర బాటిళ్లో నింపి వెంట తీసుకువెళ్లడం ఉత్తమం.

ఆంధ్రజ్యోతి: వేసవిలో ఎటువంటి వస్త్రాలు ధరించాలి?

అధికారి: వదులుగా ఉన్న కాటన్ వస్త్రాలు ధరించాలి. తెల్లని వస్త్రాలు ధరించడం మంచిది. వీలైనంత వరకు పాలిస్టార్, సిల్క్ వస్త్రాలకు దూరంగా ఉండాలి. అందులోను నలు పు వస్త్రాలు ధరించకూడదు.

ఆంధ్రజ్యోతి: వేసవిలో వచ్చే ఎలాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది?

అధికారి: చెమట ఎక్కువగా బయటకు పోవడం వల్ల నీరసం వస్తుంది. దీంతో మనిషి శక్తిని కోల్పోతారు. వృద్ధులు, చిన్నారులకు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండడం వల్ల వీళ్లను జాగ్రత్తగా చూసుకోవాలి.కొబ్బరి బొండాలు, ఓఆర్ఎస్ కలిపిన నీళ్లు, మజ్జిగ తీసుకోవాలి.



ఫొటో న్యూస్

ఏఎంసీ ఆవరణలో నూతనంగా నిర్మించిన గదులు

ప్రారంభానికి నోచుకోని నూతన భవనాలు

కుభీర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు స్థలంలో 2022-23లో నిర్మించిన నూతన భవనాలు నిరుపయోగంగా మారాయి. ఇందు కోసం ప్రభుత్వం కేటాయించిన రూ.34లక్షలతో గదులను నిర్మించారు. ప్రధానరహదారి వెంబడి ఉండడంతో హోటల్, టీస్టాల్, కూరగాయల దుకాణం, మెకానిక్ దుకాణాలు, ఇతర సరుకులు విక్రయాలు చేపట్టేందుకు నిర్మించారు. ఏడాది కిందట గదులకు రంగులు వేయించారు. అయితే ఇప్పటివరకు చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారు మధ్యలోనే నిలిపివేశారు. దీంతో నూతన గదులను విద్యుత్, నీటిపైపలైన్లు పనులు జరగలేక లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన నూతన నగదులు వృథాగా ఉండిపోయి, ఆకతాయిలకు అడ్డాగా మారింది. ఈ విషయమై ఏఎంసీ కార్యదర్శి గంగాధర్‌ను వివరణ కోరగా.. విద్యుత్ ట్రాన్స్‌పారం ఏర్పాటులో జాప్యం జరుగుతోందని త్వరలో వసతులు పూర్తి చేసి గదులను ప్రారంభిస్తామన్నారు.

పల్లెల్లో పౌరాణికానికి పెరుగుతున్న ఆదరణ

● చించాల గ్రామంలో మూడు రోజులుగా పౌరాణిక నాటకం ● చూసేందుకు భారీగా హాజరవుతున్న ప్రజలు



రేణుకా ఎల్లమ్మ ఆటను ప్రదర్శిస్తున్న కళాకారులు

ముథోల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వైజ్ఞానిక పరిజ్ఞానం దినదినం అభివృద్ధి చెందుతుందన్న తరుణంలో ప్రతీ ఇంటికి టీవీ, సెల్ ఫోన్లు ఉంటే చాలు ప్రపంచంలో జరుగుతున్న వింతలు, విశేషాలు అన్ని తెలుసుకుంటున్నప్పటికీ ఇప్పుడిప్పుడే నాటి పౌరాణిక నాటకాలు (ఆటలు), కథలకు పల్లెల్లో ఆదరణ పెరుగుతుందని చెప్పుకోవచ్చు. పురాణ కథలలో పాత్రలను రంగస్థలం మీద లేదా గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద నాడు ఈ సందేశాత్మకమైన నాటకాలను ప్రదర్శించేవారు. గ్రామాల్లో ఆ కాలంలో సమాజంలో నైతిక విలువలను, మానవ సంబంధాలపై అవగాహన కల్పించేందుకు ఈ నాటకాలు దోహదపడేవి. నేటి సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న తరుణంలో అంతరిస్తున్న నాటి పౌరాణిక నాటకాలకు ప్రస్తుతం పల్లెల్లో ఆదరణ దొరుకుతోంది. గత 3-4 సంవత్సరాల నుంచి మండలంలోని ఎడ్‌బిడ్, చించాల, ముథోల్, తదితర గ్రామాల్లో అప్పుడప్పుడు రేణుకా ఎల్లమ్మ ఆట, సత్యహరిచంద్రుడు, తదితర నాటకాలు గ్రామస్థులు ఆడుతున్నారు. గత మూడు రోజుల నుంచి చించాల గ్రామంలో ఆ గ్రామానికి చెందిన వడ్ల లింగన్న, నడిపి రాజేశ్వర్, సాయినాథ్, గంగాధర్, ఎడ్‌బిడ్, తానూర్, ముథోల్ గ్రామాలకు చెందిన వ్యక్తులు మరికొందరు ఓ జట్టుగా ఏర్పడి నాటి సందేశాత్మకమైన నాటకాలు, ఇతిహాసాలను నాటికలిస్తున్నారు. సందేశాత్మక నాటకాలివ్వాలనే ఆలోచనతో రేణుకా ఎల్లమ్మ అనే పౌరాణిక నాటకం ఆడుతున్నారు. ఈ నాటకం చూసేందుకు చుట్టుపక్కల గ్రామాలైన వెంకటాపూర్, ఎడ్‌బిడ్, బోరిగాం, ముథోల్, తరోడా, తానూర్ తదితర గ్రామాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో హాజరవుతున్నారంటే నాటి పౌరాణికం నేటి యువతకు కూడా కొత్తగా కనబడుతున్నట్లు చెప్తున్నారు. పౌరాణికం ఆదరణ పెరుగుతోందని అక్కడికి వచ్చిన కళాకారులు పేర్కొంటున్నారు.




జర దేఖో!!

ఉట్నూర్‌లోని నిర్మిత కేంద్రం

నిరుపయోగంగా నిర్మిత కేంద్రం

● చెడిపోతున్న యంత్రాలు ● పట్టించుకోని అధికారులు



చెడిపోతున్న ఇటుకల తయారీ యంత్రం



తుప్పు పట్టి చెడిపోతున్న సిమెంట్, కంకర, ఇసుక మిక్సింగ్‌యంత్రం

ఉట్నూర్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన నిర్మిత కేంద్రం నిరుపయోగంగా మారింది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కావాల్సిన సిమెంట్ ఇటుకలు, కిటికీల ఫ్రేములు తయారు చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్మిత కేంద్రం ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక అప్పటి ప్రభుత్వం నిర్మిత కేంద్రాలను నిర్వీర్యం చేయడంతో పాటు గృహనిర్మాణ శాఖలోని ఉద్యోగులను ఇతర విభాగాలకు బదిలీలు చేసింది. దీంతో నిర్మిత కేంద్రం నిరుపయోగంగా మారింది.

చెడిపోతున్న యంత్రాలు

సిమెంట్ ఇటుకలు,కిటికీల ఫ్రేములు, తలుపుల ఫ్రేములు తయారు చేసి లబ్ధిదారులకు సరఫరా చేయాలని ఏర్పాటు చేసిన నిర్మిత కేంద్రానికి వస్తువుల తయారీ కోసం తెచ్చిన యంత్రాలు చెడిపోతున్నాయి.గత 12 ఏళ్లుగా వాటిని ఉపయోగించుకోక పోవడంతో తుప్పు పట్టి ఉన్నాయి. ఉట్నూర్ మండల కేంద్రంలోని నిర్మిత కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం సైతం పిచ్చి మొక్కల మధ్య కనబడకుండా ఉంది. ఇదే ఆవరణలో సిమెంట్ ఇటుకలు తయారీకి, ఫ్రేముల తయారీకి కావాల్సిన ముడిసరుకులు ఇనుము, ఇసుకకుప్పలు సైతం మాయమయ్యాయి. లక్షలాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ ధనం వృథా అవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఇంట్లో నిర్మించడానికి కార్యచరణ ఖరారు చేయడంతో నిర్మిత కేంద్రానికి మంచిరోజులు వస్తాయని పరిశీలకులు భావిస్తున్నారు. వృథాగా పడిఉన్న సామగ్రికి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వస్తాయో లేదో అధికార యంత్రాంగం తెలుసుకోవాల్సి ఉందని ప్రజలు అంటున్నారు.



పిచ్చిమొక్కల మధ్య ఉన్న గృహనిర్మాణ శాఖ కార్యాలయం

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

● భారీగా తరలివచ్చిన భక్తజనం ● ముథోల్ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

భక్తి



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

భైంసా, మార్చి11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీపద్మావతీ శ్రీనివాసుల కల్యాణ మహోత్సవ వేడుకలు కమనీయంగా కొనసాగాయి. మధ్యాహ్నం 12గంటలకు శ్రీభూ, నీళాపద్మావతి సమేత శ్రీనివాస స్వామి ఉత్సవమూర్తుల కల్యాణోత్సవ శోభాయాత్రతో ప్రారంభమైన వేడుకలు సాయంత్రం వరకు భక్తుల కోలహలం మధ్య వైభవంగా కొనసాగాయి. ఆలయ ప్రాంగణం నుంచి ఉత్సవ మూర్తులకు కళ్యాణ వేదిక వద్దకు ముస్తాబు చేసి శోభయాత్రగా తీసుకవచ్చారు. శ్రీనివాసుడిని గరుడ వాహనంపై, అమ్మవార్లను పల్లకిలో కళ్యాణ వేదిక వద్ద భాజభజంత్రీల మధ్య తీసుకవచ్చారు . కళ్యాణ వేడుకలను నిర్వహించే దంపతులు తమ తలలపై తలంబ్రాలు, పట్టువస్త్రాలతో మంగళ హారతులతో ముందునడువగా వెనుక భాగంలో ఉత్సవ మూర్తులను శోభాయాత్రగా కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. అనంతరం వేదపండితులు చక్రవర్తుల సుదాన్వచారి కల్యాణోత్సవ వేడుకలు కమనీయంగా కొనసాగాయి. రెండున్నర గంటల శాస్త్రోక్తంగా, మంత్రోచ్ఛరణల మధ్య శ్రీవారి కల్యాణోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వహణ కమిటీ భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టింది. రాత్రి వేళలో పద్మావతీనగర్ పుర వీధుల్లో శ్రీస్వామి వారి పల్లకిని ఊరేగించారు. వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్, టౌన్ సీఐ గోపినాథ్, మున్సిపల్ కమిషనర్ రాజేంద్ర కుమార్, ఆర్యవైశ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విలాస్ గాదేవార్, గుజ్జల్‌వార్ సాయినాథ్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి సాధుల కృష్ణదాస్, విశ్వహిందు పరిషత్ ప్రతినిధులు డా.మహిపాల్, నవీన్, ఆరోగ్యభారతి ప్రతినిధి డా.రామకృష్ణగౌడ్‌తోపాటు పలువురు ప్రముఖులు వేడుకలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగిస్తున్న దృశ్యం



శోభాయాత్రలో కోలాటాలు వేస్తున్న మహిళా భక్తులు



పూజలు నిర్వహిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామరావ్‌పాటిల్

వివాదాస్పదంగా బస్టాండ్ ప్రహరీ నిర్మాణం

బోథ్,మార్చి11 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ప్రహరీ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌ను ఆనుకొని ప్రహరీ నిర్మించేందుకు సన్నాహాలు చేశారు. అయితే ఆర్టీసీ అధికారుల నిర్ణయాన్ని ప్రజలుకాంగ్రెస్ నాయకులు తప్పుపడుతున్నారు.

● పాత రికార్డుల ప్రకారమే..

ఆర్టీసీబస్టాండ్ స్థలం గుర్తించేందుకు అధికారులు పాత రికార్డులను పరిగణలోకి తీసుకొని ప్రహరీ నిర్మించాలని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరుతున్నారు. ఆ విధంగా కాకుండా బస్టాండ్‌ను అనుకొని నిర్మిస్తే గతంలో ఆర్టీసీ అధికారులకు అప్పగించిన రోడ్డు స్థలం ప్రైవేట్ వ్యక్తులకు ధారదత్తం చేసినట్టు అవుతుందని నాయకులు పేర్కొన్నారు. దీంతో ప్రహరీ నిర్మాణపనులు ఓవైపు నిలిచిపోయాయి. తాము ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకువెళ్లి బస్టాండ్‌కు ఇచ్చిన స్థలమంతా ఆర్టీసీ ఆధీనంలోకి తీసుకొని ప్రహరీ నిర్మాణం జరిగేలా చూస్తామని నాయకులు ఆర్టీసీ అధికారులకు వివరించారు.

● వివాదాల ప్రహరీ


బస్టాండ్ వెనుకభాగంలో రోడ్డు ఉండడంతో ప్రయాణికులు రోడ్డు దిగి ఇళ్లకు చేరాలంటే బస్టాండ్ ప్రహరీ వెనుక భాగంలో చిన్నపాటి గేటు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఓవైపు ప్రైవేట్ వ్యక్తులు తమ దుకాణాల సముదాయాన్ని నిర్మించుకోవడంతో అటువైపు గోడను వ్యాపార సంస్థలను ఆనుకొని నిర్మించవద్దంటూ డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ విషయంలో అధికారులు మళ్లీ ఆలోచనలో పడ్డారు. ఆర్టీసీ స్థలాన్ని వదలబోమని అధికారపార్టీ నాయకులు చెప్తున్నారు.



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు (ఫైల్‌ఫొటో)

● గ్రామపంచాయతీలో రికార్డులు మాయం

బస్టాండ్ లో ఉన్న స్థలానికి సంబంధించిన వివరాలు తెలుసుకోవాలంటే గ్రామపంచాయతీలో ఉన్న రికార్డులు మాయమయ్యాయి. గతంలో ప్రజాప్రతినిధిగా వ్యవహరించిన వారు ఈ రికార్డులను మాయం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవానికి ప్రైవేట్ వ్యక్తులు కొనుగోలు చేసిన భూమి ఎవరి ద్వారా సంక్రమించింది అనే విషయంతోపాటు ఎన్నిఫీట్ల జరగను కొనుగోలు చేశారనే విషయం తెలియాలంటే రికార్డులు తప్పనిసరి కావాల్సిన అవసరం ఉంది. స్థానికంగా రికార్డులు దొరకకపోతే జిల్లా అధికారుల నుండి తెప్పించుకొని చూస్తామంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు అంటున్నారు.





● ఇటీవల బజార్‌హత్నూర్ మండలంలో అగ్నిప్రమాదానికి గురై కాలి బూడిదైన ఇల్లు (ఫైల్)

▸ జిల్లాలో పెరిగిపోతున్న అగ్నిప్రమాదాలు.. భారీ ఆస్తి నష్టం ▸ ముదురుతున్న ఎండలు.. నీటి సమస్యే ప్రధానం ▸ శిథిలావస్థలోనే ఉట్నూర్ అగ్నిమాపక కేంద్రం ▸ బోథ్ అగ్నిమాపక కేంద్రం కోసం డిమాండ్లు ▸ వేసవిలో అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



● అగ్నిమాపక వాహనం

ముంచుకొస్తున్న.. ముప్పు కాలం!

ఆదిలాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మండిపోతున్న ఎండలకు, పగటి ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి పోతున్నాయి. వేసవి ప్రారంభం కావడంతో వేగంగా భూగర్భజలాలు కూడా అడుగంటుక పోతున్నాయి. ముప్పు కాలం ముంచుకు రావడంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 37 నుంచి 38 డిగ్రీలకుపైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. సమయానికి సేవలు అందకపోతే అగ్ని ప్రమాదాలు తీవ్రరూపం దాల్చి భారీ ఆస్తి, ప్రాణనష్టం జరిగే ప్రమాదం కనిపిస్తోంది. జిల్లాలో ఆదిలాబాద్, ఉట్నూర్, ఇచ్చోడలో మూడు అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. అయితే అన్ని కేంద్రాలకు అగ్నిమాపక వాహనాలతో పాటు ఒక మిష్టి జీపు, మూడు మిష్టి బుల్లెట్ వాహనాలు అందుబాటులో ఉంచారు. జిల్లా విభజనతో సిబ్బంది కొరత కొంత ఇబ్బందికరంగానే మారింది. ఏకాలంలో రెండు చోట్ల అగ్ని ప్రమాదాలు జరిగితే సత్వర సేవలందించడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జిల్లాలో మారుమూల గ్రామీణ ప్రాంతాలే అధికంగా ఉన్నాయి. అలాగే పత్తి పంట సాగు ఎక్కువగానే ఉంటుంది. దీంతో దాదాపుగా ఏడాదంతా పత్తి విక్రయాలు కొనసాగుతాయి. గిట్టుబాటు ధర కోసం రైతులు ఇళ్లలోనే ఎక్కువకాలం పత్తి దిగుబడులను నిల్వ చేసుకోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వేసవిలో చిన్నపాటి నిప్పురవ్వ ఎగిసిపడినా.. భారీ ప్రమాదాలకు దారి తీస్తుంది. వేసవి కాలం ముగిసేంత వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

అడుగంటిపోతున్న నీటి జాడలు

ఈ యేడు వేసవి ప్రారంభంలోనే వేగంగా భూగర్భజలాలు పడిపోవడంతో నీటిజాడలు అడుగంటుక పోతున్నాయి. మారుమూల గ్రామాల్లో ఏదైనా జరగకూడని ప్రమాదం జరిగితే నీటి లభ్యతే ప్రధాన సమస్యగా మారనుంది. స్థానికంగా ఉన్న చెరువులు, కుంటలు, వాగులు అడుగంటుక పోవడంతో నీటి కోసం కిలోమీటర్ల మేర వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి పరిస్థితులతో ప్రమాదాలను అదుపు చేయడం కష్టమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. వివిధ రకాల సమస్యలతో ప్రతియేటా ప్రమాదాల సంఖ్య పెరుగుతూ వస్తుంది. దాదాపు 50 నుంచి 60 కి.మీ.ల దూరం వెళ్లి ప్రమాదాలను నివారించే లోపే జరగాల్సిన నష్టం జరిగి పోతుంది. కేవలం 5 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల వాహనాలతో ప్రమాదాలను నివారించడం ఇబ్బందికరంగా మారిందంటున్నారు. దూరభారం పెరగడంతో పాటు సరైన వసతులు అందుబాటులో లేకపోవడంతోనే ప్రమాదాల తీవ్రత పెరుగుతోంది.

వసతులు లేవు... భవనాల కరువు

అగ్నిమాపక కేంద్రాలకు భవనాలు లేక ఏళ్ల తరబడి అరకొర వసతులతోనే కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఆదిలాబాద్, ఉట్నూర్ కేంద్రాల్లో భవనాలు అధ్వానంగా మారి కనిపిస్తున్నాయి. ఈ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో సిబ్బంది భయంభయంగానే విధులు నిర్వర్తించాల్సి వస్తుంది. ఉట్నూర్ అగ్ని మాపక కేంద్రం మరీ దయనీయస్థితిలో కనిపిస్తుంది. ఇక్కడ పక్కా భవనం లేకపోవడంతో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఓ గదిలో ఏర్పాటు చేశారు. భవన నిర్మాణం కోసం గతంలో ఆర్‌అండ్‌బీ శాఖ స్థలాన్ని ఇచ్చేందుకు ముందుకు వచ్చినా.. తర్వాత నిరాకరించడంతో భవన నిర్మాణానికి నిధులు మంజూరైన నిరుపయోగంగానే మారింది. స్థల సేకరణలో అధికారులు నిర్లక్ష్యం చేయడంతోనే సొంత భవనానికి నోచుకోవడం లేదంటున్నారు. అలాగే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో భవన నిర్మాణానికి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా.. మంజూరుకాక పోవడంతో ఏళ్ల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదు.



● సిద్ధంగా ఉన్న మిష్టి బుల్లెట్ వాహనం

అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం

: సురేష్ కుమార్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

అన్ని రకాల అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అగ్నిమాపక శాఖ సిద్ధంగా ఉంది. ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రజలు సమాచారం అందించాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పత్తిని నిల్వ చేసే సమయంలో రైతులు చిన్నపాటి జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవి ముగిసేంత వరకు అప్రమత్తంగాఉండాలి. సకాలంలో సమాచారం అందిస్తేనే నష్ట నివారణ సాధ్యమవుతుంది. ఉట్నూర్ అగ్నిమాపక కేంద్రానికి స్థల సేకరణ విషయంలో కొంత జాప్యం జరుగుతుంది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అగ్నిమాపక సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.

బోథ్‌లో అగ్నిమాపక కేంద్రం అనుమానమే..

నియోజకవర్గ కేంద్రమైన బోథ్‌లో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా డిమాండ్లు వస్తున్నాయి. అయిన ప్రభుత్వం ఇక్కడ అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టడం లేదు. ఎందుకంటే నియోజకవర్గానికి ఒక అగ్నిమాపక కేంద్రం ఉండాలన్న నిబంధన

(తరువాయి 6వ పేజీలో...)



రాలిన ఇప్పపువ్వుకు పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఇప్పపువ్వు సేకరణలో ఆదివాసీలు

బోథ్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వేసవికాలం రావడంతోనే అడవులలో ఆదివాసీలు ఇప్పపువ్వును సేకరిస్తుంటారు. తెలతెలవారుతుండగా అడవి జంతువులతో పోటీపడి ఇప్పపువ్వు సేకరణలో మునిగిపోతారు. అయితే మంగళవారం ఆదివాసీలు మండలంలోని పార్డి(కే) గ్రామంలో ఇప్పపువ్వు సేకరణ కోసం చెట్లకు వద్దకు వెళ్లి రాలిన ఇప్ప పువ్వును ఒకచోట చేర్చి ప్రత్యేకపూజలు చేశారు. దీంతో ఇప్పపువ్వు సేకరణ ప్రారంభించినట్లు గ్రామపటేల్ అమృతరావు పేర్కొన్నారు. ఇందులో దేవారి జైతూ, మెస్రం భూమన్న అనిల్ ఉన్నారు.

14న హోలీ పండగ జరుపుకోవాలి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను ఘనంగా జరుపుకోవాలని మఠాధిపతి యోగానంద సరస్వతి అన్నారు. జిల్లా కేంద్రంలోని గోపాలకృష్ణ మఠంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13న గురువారం సాయంత్రం కామదహనం, 14న శుక్రవారం హోలీ పండుగను జరుపుకోవాలని పేర్కొన్నారు. హోలీ సహజసిద్ధమైన ప్రకృతి రంగులతో మాత్రమే ఆడాలని, కెమికల్స్ రంగులను వాడొద్దని సూచించా రు. ఆయన వెంట సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్, తదితులున్నారు.

ఇన్‌చార్జీ డీడీ బాధ్యతల స్వీకరణ

ఉట్నూర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏలోని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జీ డిప్యూటీ డైరెక్టర్‌గా జాదవ్‌అంబాజి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాను కలిసి బొకే అందించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు సక్రమంగా మేను అందించేలా చర్యలు తీసుకోవడంతో పాటు పదవ తరగతి విద్యార్థుల మెరుగైన ఫలితాల కోసం చర్యలు తీసుకోవాలన్నారు.

ఉన్నతస్థాయికి ఎదగాలి : పీవో

ఉట్నూర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అభినందించారు. మంగళవారం మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా పోటీలలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీలు విద్యార్థుల బాషా నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు ఉద్దేశం చబడ్డాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు మరింత ప్రోత్సాహాలు ఇస్తామన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని 4వ తరగతి, 5వ తరగతి విద్యార్థులకు రాష్ట్రస్థాయి వర్డ్ పవర్ చాంపియన్ షిప్ (డబ్ల్యుపీసీ) పోటీకి ఎంపిక చేసేందుకు ఉమ్మడి జిల్లా స్థాయి పోటీ నిర్వహించారన్నారు.

నేడు డిజిటల్ పేమేంట్స్‌పై సదస్సు

ఉట్నూర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రిజర్వు బ్యాంకు, రీజినల్ బ్యాంకు అధికారుల ఆధ్వర్యంలో బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్‌సీ సమావేశ మందిరంలో డిజిటల్ పేమేంట్స్‌పై అవగాహన సదస్సు ఉంటుందని స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సాకేత్ తెలిపారు. ఉదయం 10గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి వినియోగదారులు హాజరు కావాలన్నారు.

'సరైన మార్గదర్శకత్వంలో నడిస్తేనే విజయాలు వరిస్తాయి'

ఉట్నూర్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): జీవితంలో నిర్దిష్ట మార్గదర్శకత్వంలో నడుస్తూ గమ్యాన్ని చేరుకునేలా ప్రతీ ఒక్క విద్యార్థి కృషి చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్, విద్యార్థులకు వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు, జనరల్ స్టడీస్, సాధారణ గణితం, ఇంగ్లీష్, రీజనింగ్ అనే అంశాలపై నిర్వహించిన వంద రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీఒక్క విద్యార్థి కష్టపడేతత్వాన్ని అలవర్చుకుని పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఇందులో ప్రిన్సిపాల్ టి.ప్రతాప్‌సింగ్, వైస్ ప్రిన్సిపాల్ డా.సాయిప్రసాద్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డా.ఎం.నర్సింగ్‌రావు, చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులున్నారు.

అలాగే, మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 66 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో ఎంపీడీవో రాంప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ అమృతలాల్, సింగిల్ విండో చైర్మన్ ఎస్సీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, పేదలకు మేలు చేకూరేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో 20 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో బాస్కర్, ఆర్‌ఐ మెస్రం లక్ష్మణ్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా ● జడ్పీ సమావేశ మందిరంలో మహిళా దినోత్సవ వేడుకలు ● పాల్గొన్న ఎమ్మెల్యే పాయల శంకర్, అధికారులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా



డీఈవో ప్రణీతను సన్మానిస్తున్న దృశ్యం

ఆదిలాబాద్ రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగినిగా.. గృహిణిగా మహిళలు రెండు బాధ్యతలను సరిసమానంగా నిర్వర్తిస్తూ అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణిస్తున్నారని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా విద్యార్థులు మహిళల గొప్పతనం గురించి వివరిస్తూ చేసిన నాటిక ప్రదర్శన, నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ శాఖల్లో రాణిస్తున్న మహిళలను కలెక్టర్ సత్కరించి ప్రశంస పత్రాలను అందించారు. అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ మహిళాలను దేవతగా పూజించే ఏకైక దేశం భారత దేశమనిఅన్నారు. అన్ని రంగాల్లో వారికి అవకాశాలు కల్పించేల ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. మహిళలు కూడా వాటిని సద్వినియోగం చేసుకుంటు ఉన్నతంగా రాణించాలన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో మహిళ బిల్లు పాస్ అయిందన్నారు. ఇప్పటికే అన్ని రంగాల్లో ఉన్న మహిళలు రాజకీయంగా కూడా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, లోకల్ కమిటీ చైర్‌పర్సన్ భవన సింగ్, ఇన్‌చార్జి జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మహిళ కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, జిల్లా టీబీ అధికారి సుమలత, డీఎంసీ యశోద, జిల్లా సమాఖ్య సభ్యురాలు వనజ, మెప్మా పట్టణాధ్యక్షులు ఉమాదేవి, డాక్టర్ నైనత, డాక్టర్ శ్రావ్య పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఇందిరమ్మ నమూనా మోడల్‌ను అందజేస్తున్న అధికారులు

కలెక్టర్‌ను కలిసిన గృహ నిర్మాణ శాఖ అధికారులు

● ఇందిరమ్మ ఇల్లు మోడల్ నమూనా అందజేత

తలమడుగు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు నిర్మించే ఇందిరమ్మ ఇంటి నిర్మాణ నమూనా మోడల్‌ను మంగళవారం గృహ నిర్మాణ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి నమూనా చిత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సూచించారు. అదేవిధంగా మండల కేంద్రాల్లో నిర్మిస్తున్న మోడల్ హౌస్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు చూయించాలని సూచించారు. ఇందులో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి బసవేశ్వరరావు, ఏఈ నసీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న జిల్లా అధికారి శ్రీధర్ స్వామి, తదితరులు

ఎండిన పంటల పరిశీలన

● 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన జిల్లా యంత్రాంగం

తాంసి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలన్నీ అడుగంటిపోయి రబీ సాగుకు నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. దీంతో చేతికి వచ్చే పంట కళ్ల ముందే ఎండిపోతుండడంతో రైతాంగం తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. దీనిపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అయ్యో.. అన్నదాత!' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ రాజార్షిషా జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి వెంటనే పంటలను పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ స్వామితో పాటు మండల వ్యవసాయ శాఖ అధికారి రవీందర్, పలువురు అధికారులు పంటలను పరిశీలించారు. పంట పొలాల్లోకి వెళ్లి నీటి కష్టాలు ఏ మేరకు ఉన్నాయో పలువురు రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈయేడు 40 రోజుల ముందుగానే భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయాయని రైతులు వాపోయారు. చేతికి వచ్చిన పంట కళ్లముందే ఎండిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బోర్లు వేయిస్తున్నప్పటికీ చుక్కనీరు రావడంలేదని, దీనివల్ల తాము లక్షలు నష్టపోవాల్సి వస్తోందని వివరించారు. చాలా గ్రామాల్లో పంటల పరిస్థితి ఇలాగే ఉందని వివరించారు. స్పందించిన జిల్లా అధికారి ఈ విషయమై పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ఇందులో ఏఈవో నికిత, రైతులు ఎల్మ గంగారెడ్డి, అర్గుల రాములు, రమేష్, తదితరులున్నారు.


చదువుతోనే మహిళల అభివృద్ధి

తలమడుగు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే తప్పకుండా చదువుకోవాలని, చదువుతోనే అభివృద్ధి సాధ్యమని బరంపూర్ హైస్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష అన్నారు. మంగళవారం మండలంలోని బరంపూర్ పాఠశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, కమిటీ తరఫున మహిళా ఉపాధ్యాయులను, మహిళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు.

'సమస్యల పరిష్కారానికే ప్రజావాణి'

భీంపూర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారం చేయడానికి ప్రజావాణి అని మండల ప్రత్యేక అధికారి కిషన్ అన్నారు. ఆయన మంగళవారం మండల అధికారులు తహసీల్దార్ నలంద ప్రియ, ఎంపీడీవో గోపాలకృష్ణరెడ్డిలతో కలిసి భీంపూర్ రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొన్నారు. ఆర్జీల కోసం వచ్చిన అర్జిదారులతో అర్జీలు తీసుకున్నారు. ఇప్పటి వరకు వివిధ సమస్యలపై 54 అర్జీలు వచ్చాయని, అందులో నుంచి 24 అర్జీలు పరిష్కారం అయ్యాయని అధికారులు తెలిపారు. ఇందులో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో సమీర్ ఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్, విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్‌రెడ్డి, సూపరింటెండెంట్ జంగు, తదితరులు పాల్గొన్నారు.

తేజస్వినిరెడ్డికి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు



తలమడుగు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన నిమ్మల తేజస్వినిరెడ్డికి ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాలు మహిళా విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు రావడం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. సుంకిడి గ్రామానికి చెందిన నిమ్మల లింగారెడ్డి కోడలు సాత్విక్‌రెడ్డి భార్య తేజస్వినిరెడ్డి గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంకు రావడం పట్ల కుటుంబీకులు, గ్రామస్థు లు అభినందనలు తెలిపారు. గృహిణిగా ఉంటూ రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించడం పట్ల ఆమెకు పలువురు గ్రామస్థులు అభినందించారు.

రంజాన్ వేళలు

బుధవారం	గురువారం
ఇఫ్తార్	సహర్
సా.6.31	ఉ.5.04



నరక శిక్ష నుంచి రక్షణ కోసం ప్రతీరోజు దువా చేయండి. ఎందుకంటే, ఆ శిక్ష.. తప్పులు చేసిన వారిని ఎన్నటికీ వీడనిది.

'ప్రభుత్వ వైఫల్యాలపై అసెంబ్లీలో ఎండగడతాం'

ఆదిలాబాద్ రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఎండగడతామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు గడుస్తున్నా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని ఆరోపించారు. గత బడ్జెట్ సమావేశంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అన్ని వర్గాలను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. వచ్చే బడ్జెట్‌లో పథకాల వారీగా నిధులు కేటాయించి అమలు అయ్యేలా చూడాలని అన్నారు.

అలాగే, జోగు రామన్న నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఉండి నువ్వు చేసింది ఏంటని ప్రశ్నించారు. జోగు రామన్న ఆదిలాబాద్ అభివృద్ధి గురించి మాట్లాడడం హాస్యాస్పదం అని, ఏడాదిలోనే అభివృద్ధి సాధ్యం అవుతుందా అని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో మీరు చేసింది ఏంటని అన్నారు. ఆదిలాబాద్ రావాల్సిన టెక్స్‌టైల్స్ పార్క్‌ను వరంగల్‌కు పోయే వరకు చూశారని అన్నారు. సీసీఐపై జోగు రామన్న రాద్ధాంతం చేస్తున్నారని.. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని, సీసీఐ పరిశ్రమ ప్రారంభమవుతుందని అన్నారు. ఎమ్మెల్యేగా నాకు పేరు వస్తుందనే ఈర్షతోనే జోగు రామన్న ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఆకుల ప్రవీణ్, జోగు రవి, రత్నాకర్ రెడ్డి, లాలామున్న, భీమ్‌సేన్ రెడ్డి, ముకుందరావు, సతీష్ పాల్గొన్నారు.

'ఎంపీ, ఎమ్మెల్యేలు అబద్ధాలు ఆడుతున్నారు'

ఆదిలాబాద్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): 'ఎయిర్‌పోర్టు, సీసీఐ పరిశ్రమ విషయంలో ఎంపీ, ఎమ్మెల్యేలు పచ్చిఅబద్దాలు ఆడుతున్నారు. ఎంపీ సొంత గ్రామమైన జాతర్ల శివాలయంలో ప్రమాణం చేద్దామా' అంటూ మాజీ మంత్రి జోగు రామన్న ఎంపీ గోడం నగేష్‌కు సవాల్ విసిరారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఎయిర్‌పోర్టుకు సంబంధించిన ఫైల్ క్లియర్ చేయలేదంటూ ఎంపీ, ఎమ్మెల్యేలు ఆరోపించడం వాస్తవం కాదన్నారు. కేటీఆర్‌తో కలిసి ఎంపీ గోడం నగేష్‌ను వెంట పెట్టుకుని ఢిల్లీ పెద్దలను కలిసిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఇన్నాళ్లు ఎంపీ నగేష్‌కు కొంత మంచి పేరే ఉండేది, కానీ దొంగ ఆవులతో కలిసి ఆయన కూడా దొంగలా మారిపోతున్నాడని తీవ్ర విమర్శలు చేశారు. స్క్రాప్ అమ్ముకున్న ఫర్వాలేదు కానీ, సీసీఐ పరిశ్రమను పునరుద్ధరిస్తామని ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీసీఐ పరిశ్రమపై స్పష్టమైన హామీని ఇవ్వకుంటే త్వరలోనే అన్ని పార్టీలు, విద్యార్థి సంఘాలతో కలిసి ఆందోళన చేపడతామన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే జిల్లాకు వ్యవసాయ కళాశాల, ఐటీ పరిశ్రమ, జైనథ్‌కు 33/11 సబ్‌స్టేషన్, ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందులో మెట్టు ప్రహ్లాద్, అజయ్, కుమ్ర రాజు, దమ్మపాల్, పండ్ల శ్రీనివాస్, పందిరి భూమన్న, మహేందర్, రాహుల్, దయాకర్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.